

అజీజ్‌నగర్ పాఠశాలలో బడీడు పిల్లలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రి, బాత్‌రూమ్‌లు

మోగనున్న బడిగంట

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- కార్పొరేట్‌కు దీటుగా సకల సౌకర్యాలు
- ఇప్పటికే స్కూళ్లకు చేరిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మొయినాబాద్‌రూరల్: ఎండాకాలం సెలవులు ముగియడంతో నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం కానున్నాయి. దాదాపు నెలన్నర పాటు ఆటపాటలతో సంతోషంగా గడిపిన పిల్లలు బడిబాట పట్టనున్నారు. సర్కారు స్కూళ్లకు సున్నాలు, రంగులు వేసి ముస్తాబు చేశారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే స్కూళ్లకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు చేరగా అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆకర్షణీయంగా అజీజ్‌నగర్ పాఠశాల..

అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల కొత్త రంగులు అందాలతో ఆకర్షణీయంగా దిద్దుకుంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని హంగులతో అభివృద్ధి నిర్వహించారు. ×మన ఊరు–మన బడి౯ కార్యక్రమంలో అజీజ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధిలో భాగంగా 30.28 లక్షలు వెచ్చించారు. దీనికి తోడుగా వివిధ స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించడంతో పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా అన్ని హంగులతో ఆకర్షణీయంగా తయారైంది. ముఖ్యంగా పాఠశాల గేటుతో పాటు బోర్డు ఏర్పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుల కార్యాలయానికి కొత్త రంగులు, పాఠశాలలోని విద్యార్థులు కూర్చునేందుకు రంగురంగుల బెంచీలు, బ్లాక్ బోర్డులు, కావాల్సిన బీరువాలు సమకూర్చారు. అదే విధంగా ఈ పాఠశాలకు విద్యుత్ సరఫరా కోసం సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నారు. దీంతో అజీజ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జిల్లాలోనే ఆదర్శంగా అవుతుందని గ్రామస్తులతో పాటు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. నేడు పునఃప్రారంభం కానుండడంతో ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాలలను శుభ్రం చేయిస్తున్నారు. బడీడు పిల్లలతో నేడు బుధవారం రోజు పాఠశాలలో చేరాలని తల్లిదండ్రులతో ముచ్చటిస్తున్నారు. బడిబాట కార్యక్రమంతో పాటు ప్రత్యేక విధులు నిర్వహిస్తు పిల్లల అభివృద్ధే తమ ధ్యేయంగా పని చేస్తున్నారు. మొయినాబాద్ మండలంలోనే అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో అత్యధికంగా విద్యార్థులు 275 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఈ సంవత్సరం 5వ తరగతి నుంచి 35 మంది పోతే వారికి బదులుగా అధిక మంది విద్యార్థులను తీసుకురావడానికి కృషి చేస్తున్నామని పేర్కొంటున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..



విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పాఠశాల పునఃప్రారంభానికి అన్ని సిద్ధం చేశాం. అజీజ్‌నగర్ పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు ఉన్నా ప్రభుత్వం ద్వారా ప్రైవేట్‌పరంగా దాతలు కృషి చేయడంతో కార్పొరేట్‌కు దీటుగా అన్ని సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులకు కనీస వసతులు సమకూర్చాం.

– నర్సింహ్మనాయక్, హెచ్‌ఎం, అజీజ్‌నగర్

మిషన్ భగీరథపై సర్వే చేయలేం

తహసీల్దార్‌కు అంగన్‌వాడీల వినతి

నందిగామ: ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా నీరు వస్తుందా లేదా అనే విషయమై తాము సర్వే చేయలేమని మండలంలోని పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. ఐసీడీఎస్ శాఖకు సంబంధం లేని శాఖ మిషన్ భగీరథ అన్నారు. అయినా ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంలో భాగంగా చేపట్టిన పనుల వివరాలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి సర్వే చేపట్టాలని ఆదేశించడం సబబు కాదన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లానీరు వస్తుందా.. రావట్లేదా.. అని సమగ్ర సర్వే చేసి, నల్లా ఫొటోతో పాటు ఇంటి యజమాని ఫొటో కూడా తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఇటీవల ఆదేశాలు వచ్చాయని చెప్పారు. ఇప్పటికే తమకు అనేక పనులు అప్పజెప్పారని, తాజాగా మిషన్ భగీరథ సర్వే చేయాలంటే తమకు పనిఒత్తిడి ఎక్కువ అవుతుందని వారు ఆరోపించారు. సర్వే చేయడం తమకు సాధ్యం కాదని వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శోభారాణి, సంతోష, శివలీల, జానకి, మంజుల, సుజాత తదితరులు ఉన్నారు.

సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలి



కొత్తూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కొత్తూరు: మిషన్ భగీరథ సర్వే పనుల నుంచి అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులను మినహాయించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబ కోరారు. ఇందులో భాగంగా ఆయన మంగళవారం పలువురు అంగన్‌వాడీలతో కలిసి తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: మిషన్ భగీరథ పథకంలోని ఇంటింటికీ నల్లా కనెక్షన్‌ల సర్వేను తమకు ఇవ్వొద్దని అంగన్‌వాడీ టీచర్ల సంఘం ప్రాజెక్టు అధ్యక్షురాలు జయమ్మ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు మండల కేంద్రంలోని తహసీల్దార్ అజీం అలీకి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను గుర్తించి సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టీచర్లు మమత, అమృత, వజ్రమ్మ, మొహనమ్మ, పద్మమ్మ, శివలీల, సంతోష, పాపమ్మ పాల్గొన్నారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో రైతు భరోసా పథకానికి సంబంధించి ఎకరానికి 15వేల రూపాయల నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని భూపోరాట కేంద్రం సీపీఐ కాలనీ–2 వద్ద మంగళవారం చేవెళ్ల మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. పంటల సాగు చేసే సీజన్ వచ్చిందని రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో సర్వే నెం.75లో పేదలు గత 16 నెలలుగా గుడిసెలు వేసుకొని భూపోరాటం చేస్తున్నారని ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల, సహాయ కార్యదర్శి ఎండీ మక్బుల్, నాయకులు శివ, యాదగిరి, శ్రీకాంత్, పెంటయ్య, లలిత, తదితరులు ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



అజీజ్‌నగర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మొయినాబాద్: బడీడు పిల్లలందరినీ తప్పనిసరిగా బడిలో చేర్పించాలని అప్పోజీగూడ మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు అన్నారు. మండల పరిధిలోని అప్పోజీగూడలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ, ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహ్మ, ఉపాధ్యాయురాలు అమృత, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు సీమ కదం, సత్యనారాయణ, సౌమ్య, హరీశ్, నాయకులు ప్రభులింగం, రాజు తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌నగర్‌లో..

మొయినాబాద్‌రూరల్: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అజీజ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రిజియా సుల్తానా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఉపాధ్యాయులతో కలిసి ఆమె బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, యాదగిరి, నరేందర్, సింహాచలం, సక్కుబాయి, సమీనా, షైరా, సునీల్‌భాషా, బాలస్వామిరెడ్డి, రాములు, నర్సింహులు, శ్రీయా సకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన

ఎంపీడీఓ ఆంజనేయులు



విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలకు మంగళవారం పాఠశాల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం పాఠశాల మూతపడే పరిస్థితి దాపురించిందని అలాంటి పాఠశాలలను ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, ఉషశ్రీ విధుల్లో చేరాక పాఠశాలకు పూర్వవైభవం వచ్చిందన్నారు. విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతగానో ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలకు అర్హత సాధించిన 20 మంది విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, ఎంపీటీసీ ఇస్తారమ్మ, చైర్మన్ భారతమ్మ, నాయకులు మానయ్య, శ్రీను, శ్యామ్, సుధాకర్‌గౌడ్, చంద్రశేఖర్, జంగయ్య, ప్రవీణ్, పరిమళ, డాక్టర్ రెడ్యానాయక్ పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



చేవెళ్లలోని ప్రాథమిక ఉర్దూ మీడియం పాఠశాలలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న సీఆర్పీలు

చేవెళ్ల: నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలలకు అందిస్తున్నామని సీఆర్‌పీలు కృష్ణ, శంకర్, శ్రీనివాస్, నర్సింలు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు దాదాపు 30వేల పాఠ్యపుస్తకాలు అవసరం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆయా పాఠశాలలకు 15,090 పుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కాబోతుండడంతో విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు అన్ని పాఠశాలలకు పుస్తకాలు అందిస్తున్నట్లు చెప్పారు. దీంతోపాటు విద్యార్థులకు యూనిఫాంలు కూడా సిద్ధమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

మొయినాబాద్: పాఠశాలల పునఃప్రారంభ సమయానికే ప్రభుత్వ బడులకు పాఠ్యపుస్తకాలు చేరాయి. మండలానికి ఇప్పటికే సుమారు 70 శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయి. మండలానికి 27,420 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 17,605 వచ్చాయి. మండల వనరుల కేంద్రానికి వచ్చిన పాఠ్యపుస్తకాలను మంగళవారమే పాఠశాలలకు చేరవేశారు. మండలంలోని 32 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 14 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను చేరవేశారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు త్వరలోనే వస్తాయని మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు.

సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య



ఉపాధ్యాయులకు యూనిఫాంలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ శంకర్‌రాథోడ్

షాబాద్: సర్కార్ బడుల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ శంకర్‌రాథోడ్ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని డ్వాక్రా భవనంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి విడతగా 3,868 వేల యూనిఫాంలను అందజేశామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడులకే పంపించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి లక్ష్మణ్, ఏపీఎం నర్సింహులు, ఉపాధ్యాయులు హనుమంతు, ప్రశాంత్, లక్ష్మమమ్మ, స్వప్న, గాయత్రి, కాఖాపాషా, వైశాలి, ప్రసన్న, గణేశ్ తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎల్‌ఎన్ గార్డెన్‌లో వ్యవసాయ, పోలీసుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో వానాకాలం–పంటల సాగుకు సమాయత్తంపై నియోజకవర్గంలోని ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల డీలర్లు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. పంట పెట్టుబడి సాయం అందించడంతో పాటుగా త్వరలోనే రైతు రుణమాఫీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలపైనే ఆశలు పెట్టుకుంటారని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులను అమ్మి రైతులను మోసం చేయొద్దన్నారు. అనంతరం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. నకిలీ ఎరువులు, విత్తనాలు, మందులు అమ్మినా, నిల్వ ఉంచినా వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, ఏడీఏ రాజారత్నం, ఏసీపీ లింగస్వామి, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, ఏఓలు నిషాంత్‌కుమార్, గోపాల్, శిరీష, కృష్ణమోహన్, ఎస్ఐలు, ఏఈఓలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తయ్యేదెప్పుడో?

- వసతుల కల్పనలో తీవ్ర జాప్యం
- సమస్యలతోనే స్వాగతమివ్వనున్న విద్యాసంస్థలు
- పూర్తికాని అమ్మ ఆదర్శ పనులు



రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో తలుపులు లేని టాయిలెట్స్

మొయినాబాద్: వేసవి సెలవులు ముగిశాయి. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈసారి కూడా ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతోనే స్వాగతమివ్వనున్నాయి. అమ్మ ఆదర్శ క మిటీ పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్ రిపేర్, కరెంటు ఏర్పాట్లు, తలుపులు, కిటికీలు, చిన్నచిన్న రిపేర్లు చేయించాలని ప్రభు త్వం నిర్ణయించింది. అందులో భాగంగా మొయినాబాద్ మండలంలోని 19 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశారు. ప్రభుత్వం ఇచ్చే నిధులతో బడులు తెరిచే లోపే పనులన్నీ పూర్తిచేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు అన్ని పాఠశాలల్లో పనులు పూర్తికాలేదు. చందానగర్, నాగిరెడ్డిగూడ గ్రామాల్లో మాత్రమే పనులు పూర్తికావొచ్చాయి. పదిరోజుల క్రితం నాగిరెడ్డిగూడ పాఠశాలను కలెక్టర్ శశాంక సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. కుత్బుద్దీన్‌గూడ, ఎలుకగూడ, సురంగల్, చాకలిగూడ, కేతిరెడ్డిపల్లి, చిన్నషాపూర్, సజ్జన్‌పల్లి, నక్కలపల్లి, అప్పారెడ్డిగూడ, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చందానగర్, అప్పోజీగూడ, ఎనికేపల్లి, ముర్తూజగూడ, ఎత్‌బార్‌పల్లి, శ్రీరాంనగర్, అమ్డాపూర్ గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నా ఇప్పటివరకు పనులు పూర్తికాలేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేట్లు లేవు.

చేవెళ్ల మండలంలో 36 పోస్టులు ఖాళీ

చేవెళ్ల: మండలంలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదు. దీంతో గతంలో ఉన్న వసతులతోనే పాఠశాలలను ప్రారంభించేందుకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. మండలంలోని అన్ని పాఠశాలలను, బాత్‌రూమ్‌లను శుభ్రం చేయించే పనులు చేపట్టారు. మొదటిరోజు విద్యార్థులు వచ్చేసరికి కనీసం తరగతి గదులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూస్తున్నారు. మండలంలో మొత్తం 66 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఆయా పాఠశాలలోని పలు సబ్జెక్టుల వారీగా మొత్తం 36 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవటంతో గతేడాది లాగానే పాఠశాలల్లో అవే సమస్యలతో ప్రారంభం కానున్నాయి. మన ఊరు–మన బడి కింది మండలంలో 24 పాఠశాలలు, ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 20 పాఠశాలలను ఎంపిక చేసి అందులో మౌలిక వసతులు, అదనపు గదుల నిర్మాణాల పనులు చేపట్టారు. అయితే ఈ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు విడుదల చేసి త్వరగా పూర్తి చేయించాలని కోరుతున్నారు. దీనిపై పలువురు ఉపాధ్యాయులను అడగగా వారు మౌలిక వసతుల కల్పనకు ఎంపిక చేసిన పాఠశాలలకు నిధులు పూర్తిస్థాయిలో రాకపోవటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయలేదని చెప్పారు. దీంతో పాఠశాలలు కొనసాగించేందుకు తరగతి గదులను శుభ్రం చేసి బాత్‌రూమ్‌లను వాడుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు.



పునఃప్రారంభానికి సిద్ధమైన మల్కాపూర్ ఉన్నత పాఠశాల

క్లుప్తంగా

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, తదితరులు

చేవెళ్ల: బీజేపీ ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రిగా ఎన్నికైన కిషన్‌రెడ్డిని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ చేవెళ్ల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఉదయం నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వైభవ్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఉన్నారు.

ఎంపీలు ఈటల, కొండాను కలిసిన నాయకులు

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల బీజేపీ నాయకులు ఎంపీలుగా గెలుపొందిన ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను మంగళవారం వారి నివాసాలకు వెళ్లి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసి పనిచేద్దామని వారు తెలిపారన్నారు. వచ్చేది బీజేపీ కాలమేనని అందరూ కష్టపడి పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని హిమాయత్‌నగర్‌లో గల సోమేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయంలో శివలింగానికి అభిషేకాలు, గణపతి హోమం నిర్వహించి పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని జరిపించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు వేలసంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ చైర్మన్ ముదిగొండ జంగం యాదవ్, మాజీ సర్పంచ్ ముదిగొండ రాజయ్య, సభ్యులు శివరాజు తదితరులు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో సోమేశ్వర ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

చేవెళ్ల: ఆశాలకు పరీక్షలు పెట్టాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోర్‌కు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు 33 ఏళ్లుగా పనిచేస్తున్నారని వారికి ఇప్పుడు పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయం సరైందికాదన్నారు. కరోనా కాలంలో ప్రజలకు వారు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. అలాంటిది ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు పరీక్షలు పెట్టాలని నిర్ణయించటం సరైందికాదని దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 13వ తేదీన రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ముట్టడికి సిద్ధమవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నపూర్ణ, విజయలక్ష్మి, కోశాధికారి ఉమ, మంజుల, శాంత, సుజాత పావని, సుజాత, పావని, సుజాత, శోభారాణి పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపండి

మున్సిపల్ కార్యాలయంలో వినతి

షాద్‌నగర్‌రూరల్: ఇళ్ల మధ్యలో నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని అడ్డుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు నడికూడ యాదగిరియాదవ్ మున్సిపల్ మేనేజర్ నయాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరియాదవ్ మాట్లాడుతూ.. పట్టణంలోని 22వ వార్డు రతన్‌కాలనీలో కొందరు ఇళ్ల మధ్యలోనే సెల్‌ఫోన్ టవర్‌ను నిర్మిస్తున్నారని, సెల్ టవర్‌తో వచ్చే రేడియేషన్, వైబ్రేషన్‌తో ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సెల్ టవర్ నిర్మాణ పనులను అడ్డుకోవాలని ఆయన కోరారు.